ప్రజలకు ఆహ్లాదం పంచాల్సిన పార్కు కళావిహీనంగా మారింది. చెత్తాచెదారంతో నిండిపోయి..డంపింగ్ యార్డ్‌ను తలపిస్తోంది. చీకటి పడితే మందుబాబుల చిందులకు అడ్డాగా మారింది. ఫలితంగా ఈ పార్కులోకి ప్రజలు అడుగు పెట్టాలంటే భయపడాల్సిన పరిస్థితి వచ్చింది. పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం కారణంగా పార్కు అధ్వానంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.



వాకింగ్ ట్రాక్ చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

ఆహ్లాదానికి చోటేది?

- అభివృద్ధికి దూరంగా 20-20 పార్కు
- ఆకతాయిలకు అడ్డాగా మారిన వైనం
- చీకటి పడితే మందుబాబుల చిందులు
- పేరుకుపోయిన చెత్తా చెదారం
- సేద తీరే చోటు లేక అవస్థలు

వాకింగ్ ట్రాక్ ఉన్నా..

వాకింగ్ ట్రాక్ ఉన్నా నిర్వహణ లోపం కారణంగా అధ్వానంగా తయారైంది. వర్షం పడితే చాలు వాకింగ్ ట్రాక్ మధ్యలో నీరు నిలిచిపోతోంది. అలాగే వాకింగ్ ట్రాక్ చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో అందులో వాకింగ్ చేసే అవకాశం లేకుండాపోయింది. రోజూ ఉదయం సాయంత్రం వేళల్లో వాకింగ్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెదగంట్యాడ: ప్రజల అవసరాలకు తగ్గట్టుగా పార్కు నిర్మించినా నిర్వహణలేక అవస్థలు తప్పడం లేదు. పాత అయ్యన్నపాలెం, పెదకోరాడ ప్రాంతంలోని 20-20లో వైఎస్సార్ ప్రగతి పార్కు నిర్మించారు. దీంతో ఈ ప్రాంత వాసులు పార్కులో సందడి చేసేవారు. వ్యాయామంతో పాటు పిల్లలకు వినోద కేంద్రంగా ఉండేది. ప్రస్తుతం ఆలనాపాలనా లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

పటించుకోని యంత్రాంగం

పార్కు నిర్వహణను ఇటు జీవీఎంసీ అధికారులు అటు ఉద్యానవన సిబ్బంది పటించుకోవడం మానేశారు. దీంతో మొక్కలు ఎండిపోయి పశువుల దొడ్డిగా మారిపోయింది. జన సంచారం లేకపోవడంతో ఆకతాయిలకు అడ్డాగా మారింది. మలమూత్ర విసర్జన కూడా ఇక్కడే కానిచ్చేస్తున్నారు.



పార్కు ముఖద్వారం

నాడు కళకళ.. నేడు వెలవెల

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2021లో పార్కును అభివృద్ధి చేశారు. రూ.20లక్షలతో పార్కులో మొక్కలు నాటారు. వాకింగ్ ట్రాక్ నిర్మించారు. పార్కులో ప్రవేశ మార్గం వద్ద పెద్ద గేటు ఏర్పాటు చేయడంతో పాటు 20-20 వైఎస్సార్ ప్రగతి పార్కు అని నామకరణం చేశారు. అద్దమైన బొమ్మలను తీర్చిదిద్దారు. ప్రగతి భారతి ఫౌండేషన్, జీవీఎంసీ సహకారంతో ఈ పార్కును అందంగా తయారు చేశారు. ప్రస్తుతం దీనిని అటు పాలకులు, ఇటు అధికారులు పట్టించుకోకపోవడంతో వెలవెలబోతోంది. పార్కులోని వాకింగ్ ట్రాక్ మొత్తం పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయింది. పార్కులో నాటిన అందమైన మొక్కలకు సంరక్షణ లేకపోవడంతో అవన్నీ ఎండిపోయాయి.

భరించలేని దుర్వాసన..

పార్కు మొత్తం చెత్తాచెదారంతో నిండిపోవడంతో వర్షం పడితే చాలు ఆ చెత్తంతా కుళ్లిపోతోంది. దీని వల్ల ముక్కుపుటాలు అదిరిపోయే దుర్వాసన వెదజల్లుతోంది. ఎవరూ పట్టించుకోపోవడంతో పక్కనే ఉన్న దుకాణదారులు చెత్తను ఈ పార్కులోనే వేస్తున్నారు.



డంపింగ్ యార్డులా పార్కు లోపలి భాగం

పేరుకే పార్కు..



గత ప్రభుత్వ హయాంలో 200-20 పార్కును అభివృద్ధి చేశారు. ప్రస్తుతం దీన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. పేరు పార్కు ఉన్నా దాని వల్ల స్థానికులకు ఎలాంటి ఉపయోగం లేదు. కాసేపు ఉపశమనం కోసం పార్కులోకి వెళ్లాలంటేనే భయమేస్తోంది. చెత్తాచెదారంతో నిండిపోయింది. వాసన వస్తోంది. పశువులు, విష పురుగులు తిష్ట వేసి ఉన్నాయి.

–గొందేశి నాగిరెడ్డి, పాత అయ్యన్నపాలెం

పట్టించుకునే వారేరి?



పాలకులు, అధికారులు పార్కును పట్టించుకోవడం లేదు. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేసిన ఈ పార్కు అధ్వానంగా మారింది. పాతఅయ్యన్నపాలెం, పెదకోరాడ ప్రాంతాలకు చెందిన పార్కు ఇదొక్కటే కావడంతో పిల్లలు ఆడుకోవడానికి గానీ, పెద్దలు సేద దీరడానికి కూడా అవకాశం లేకుండా పోతోంది. అధికారులు స్పందించి పార్కుకు పూర్వ వైభవం తీసుకురావాలి. పచ్చదనాన్ని పెంపొందించి వినియోగంలోకి తీసుకురావాలి.

– చినిపిల్లి రమ్య, పెదకోరాడ.

సేదతీరే అవకాశం లేదు



పారిశ్రామిక ప్రాంతం కావడంతో కాలుష్యంతో సతమతమవుతున్నాం పార్కులు ఉంటే రోజూ ఏదో ఒక సమయంలో సేదతీరే అవకాశం ఉంటుంది.. పార్కుల కోసం ఉన్న స్థలాలను అభివృద్ధి చేయాలి. ప్రగతి పార్కును అభివృద్ధి చేస్తే ప్రజలు ఎక్కడికెక్కడికో వెళ్లే పరిస్థితి ఉండదు.అధికారులు, పాలకులు స్పందించి పార్కును వినియోగంలోకి తీసుకురావాలి.

–జీవి రెడ్డి, పాతఅయ్యన్నపాలెం.

ఆదాయపన్నుపై అవగాహన



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఇన్‌కంట్యాక్స్ జాయింట్ కమిషనర్ ప్రసాద్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఇన్‌కమ్‌టాక్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆదాయపు పన్ను చెల్లింపుల్లో వచ్చిన మార్పులు, ఇటీవల పరిణామాలను టీడీస్ సర్కిల్ జాయింట్ కమిషనర్ కె. ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ ఐ. మధుసూదనరావు వివరించారు. ఆర్థిక సమాచారం, వార్షిక సమాచార వ్యవస్థ ద్వారా డేటా సేకరణ, అప్పీళ్ల గురించి తెలియజేశారు. ఐటీ మినహాయింపులు, నిజమైన క్లెయిమ్‌లు, పన్ను చెల్లింపుదారుల సేవలపై అవగాహన కల్పించారు. ఉద్యోగులు లేవనెత్తిన సందేహాలను వారు నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఆదాయపు పన్ను శాఖ, స్టీల్‌ప్లాంట్ అధికారులు పాల్గొన్నారు.

వడ్లపూడి రహదారికి మరమ్మతులు చేపట్టాలి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు

గాజువాక: జీవీఎంసీ 87వ వార్డులోని వడ్లపూడి ప్రధాన రహదారి మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రికి వినతిపత్రం అందజేశారు. కణితి గాంధీ బొమ్మ కూడలి నుంచి వడ్లపూడి జాతీయ రహదారి వరకు రెండువైపులా పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. వర్షాలు పడే సమయాల్లో గోతుల్లో వాహనాలు మళ్లిస్తే పల్టీలు కొడుతున్నాయని, అలాగే ప్రధాన కూడళ్లలోని కల్వర్టులు శిథిలం కావడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో వైఎస్సార్ సీపీ గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, నాయకులు చిత్రాడ రమణ, ఆదారి శ్రీను ఉన్నారు.

అధ్వానంగా యారాడ రోడ్డు



అధ్వానంగా దర్శనమిస్తున్న యారాడ రహదారి

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు పరిధిలోని యారాడ గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. రాళ్లు తేలిపోవడంతో పాటు ఎక్కడికక్కడ గోతులమయం కావడంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. పెదగంట్యాడ నుంచి గంగవరం మీదుగా యారాడ తీరంతో పాటు గ్రామానికి వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలమంది ఈ రహదారి గుండా రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఈ రోడ్డు మొత్తం గోతులమయం కావడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిని బాగుచేయాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

డీసీపీ - 2 మేరీ ప్రశాంతి బాధ్యతల స్వీకరణ



డీసీపీ మేరీ ప్రశాంతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్‌ఐ రవికుమార్

అక్కిరెడ్డిపాలెం: డీసీపీ – 2గా మేరీ ప్రశాంతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు ఏసీపీ టి.త్రినాథ్ సమక్షంలో ఎస్‌ఐ టి.రవికుమార్ పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. స్టేషన్‌లో అందరినీ పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్‌ను కట్టుదిట్టంగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు.

ఉరివేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అక్కిరెడ్డిపాలెం: గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో జింక్ ఓల్డ్ క్వార్టర్స్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకున్నట్లు గాజువాక ఎస్‌ఐ టి.రవికుమార్ తెలిపారు. ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి వయసు 50 నుంచి 60 ఏళ్లు ఉంటుందని పేర్కొన్నారు. వైట్ అండ్ గ్రే కలర్ ఫుల్ హ్యాండ్స్ షర్టు, గ్రే కలర్ ఆఫ్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు గాజువాక సీఐ 9440796014, ఎస్‌ఐ 7675022534 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పరమేశ్వరునికి పంచామృతాభిషేకాలు



పరమేశ్వరునికి అభిషేకాలు చేస్తున్న అర్చకుడు వాసుదేవశర్మ

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని బాలచెరువులో వేంచేసియున్న ఉమారామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో సోమవారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో పార్వతీదేవిని వెండిచీరతో అలంకరించారు. పార్వతీపరమేశ్వరులకు విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

పోర్టు హాస్పిటల్ పీపీపీ బిడ్స్ రద్దుకు డిమాండ్



పోర్టు హాస్పిటల్ వద్ద రిలే నిరాహార దీక్షలో అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్‌ను పీపీపీకి ఇచ్చేందుకు ప్రతిపాదించిన బిడ్స్ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని, ఆస్పత్రిని పోర్టు అథారిటీయే సొంతంగా నిర్వహించాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పోర్టు ఆస్పత్రి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 14వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకుడు మసేన్, హెచ్‌ఎంఎస్ నాయకుడు మంగనాయుడు, సీఐటీయూ నాయకులు కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, బి.జగన్, ఐఎన్‌టీయూసీ నాయకుడు గొర్లె చందు, సీఎఫ్‌టీయూ నాయకుడు మూర్తి, బీఎంఎస్ నాయకుడు రవిశంకర్ మాట్లాడారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని, ఏటా కోట్ల రూపాయల లాభాలు ఆర్జిస్తున్న పోర్టు యాజమాన్యమే సొంత నిధులతో ఆస్పత్రిని నిర్వహించాలని కోరారు. మరో 100 సంవత్సరాలకు సరిపోయే రిజర్వు ఫండ్స్ పోర్టు వద్ద ఉన్నాయని, అయినా ఆస్పత్రిని ప్రైవేటు, కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని బీజేపీ ప్రభుత్వం ఆలోచించడం దుర్మార్గమని ఆరోపించారు. రామలింగేశ్వర్రావు, శంకర్రావు, నాయుడు, రాఘవులు, రమణ పాల్గొన్నారు.

వైద్య సేవలు అరకొరే!



రాంనగర్ యూపీహెచ్‌సీ

రాంనగర్ యూపీహెచ్‌సీకి ఇన్‌చార్జి వైద్యుడే దిక్కు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డులోని రాంనగర్ యూపీహెచ్‌సీలో వైద్యసేవలు గగనమయ్యాయి. సుమారు 60 వేల మందికి వైద్య సేవలు అందించడానికి ఏర్పాటు చేసిన ఆస్పత్రిని ఇన్‌చార్జి వైద్యుడితోనే నడిపేస్తున్నారు. దీంతో ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. జ్వరం వైద్యానికి సైతం ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి

గత ప్రభుత్వం ప్రజలకు వైద్య సేవలను చేరువ చేసింది. దీనిలో భాగంగా ప్రతి రెండు కిలోమీటర్ల పరిధిలో యూపీహెచ్‌సీలు ఏర్పాటు చేసింది. రెగ్యులర్ వైద్యుడితో పాటు స్పెషలిస్ట్ వైద్యుల సేవలను చేరువ చేసింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత స్పెషలిస్ట్ సేవలకు మంగళపాడింది. ఇక రెగ్యులర్ వైద్యుడి నియామకం కూడా చేపట్టలేదు. అక్కిరెడ్డిపాలెం, రాంనగర్, మింది, గుడివాడఅప్పన్నకాలనీ, రాజీవ్‌నగర్, కాళికానగర్, గిరిప్రసాద్‌నగర్ కాలనీలకు చెందిన సుమారు 60 వేలకు పైగా జనాభాకు వైద్య సేవలు అందించడానికి డాక్టర్ వైఎస్సార్ యూపీహెచ్ ఏర్పాటు చేశారు. అయితే కొద్ది నెలల నుంచి డాక్టర్ లేకపోవడంతో రోగులకు పూర్తి స్థాయి వైద్యం అందడం లేదు. ప్రస్తుతం ములగాడ యూపీహెచ్‌సీ డాక్టర్ తిలక్ కుమార్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఆయన రానప్పుడు రోగులకు వైద్యం అందడం లేదు. వెంటనే యూపీహెచ్‌సీకి పూర్తి స్థాయి వైద్యుడిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

పారిశుధ్య కార్మికుల జీతాలు చెల్లించాలి



జెడీసీకి వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్‌లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల మిస్సింగ్ జీతాలు, పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు వినతి పత్రం సమర్పించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్ శేషాద్రిని సోమవారం కలిసి సమస్యను వివరించారు. గాజువాక జోన్‌లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఆప్కాస్‌ద్వారా జీతాలు చెల్లించేవారని, రెండేళ్ల నుంచి కొంతమంది కార్మికులకు జీతాలు మిస్సయ్యాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి ఎన్ని సార్లు తీసుకువెళ్లినా సమస్య నేటికీ పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కోసం నియమితులైన డే అండ్ నైట్ పారిశుధ్య కార్మికులకు, డైలీ వేజ్ లేబర్‌కు కూడా జీతాలు చెల్లించడంలేదన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో నాయకులు గొల్ల రాము, సోమాధుల గణేష్ తదితరులు ఉన్నారు.

రోడ్లు ఇలా.. రాకపోకలెలా?



కణితి వందడుగుల రోడ్డుకు వెళ్లే కూడలిలో నూతుల్లాంటి గోతులు



శిథిలమైన మెయిన్‌రోడ్డు

అగనంపూడి: ఓపక్క గోతులతో తంటాలు.. మరో పక్క రహదారి విస్తరణ పనులు ముందుకు సాగక అవస్థలు... వెరసి వాహనచోదకులకు ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. జాతీయ రహదారిపై కూర్మన్నపాలెం నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో పలు చోట్ల నూతుల్లాంటి గోతులు ఏర్పడడంతో వాహన చోదకులు బెంబేలెత్తుతున్నారు. పాత డ్రైనేజీలను పూడ్చకపోవడం, మట్టిని ఎక్కడికక్కడే వదిలేయడంతో రోడ్డు రెండువైపులా కుదించుకుపోయింది. దీంతో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీనికి తోడు సుధా ఫర్నిచర్, కణితి అంబేడ్కర్ కాలనీ, వుడా ఫేజ్-6 కెనాల్ వద్ద రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ఉదయం ఏడు నుంచి 9 వరకు, సాయంత్రం నాలుగు నుంచి రాత్రి 9 వరకు వాహనాలకు క్యూ కట్టాల్సి వస్తోంది. గోతుల వద్ద ట్రాఫిక్ నిలిచిపోతుండడంతో పాఠశాలలు, కళాశాలలు, ఫార్మా, సెజ్ ఉద్యోగులు సమయానికి వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. రహదారి విస్తరణ పనులు చేపట్టేవరకు గోతులైనా పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

నిత్యావసర సరకుల ధరలు నియంత్రించాలి

సీతంపేట : రాష్ట్రంలో భారీగా పెరిగిన వంట నూనె, నిత్యావసర సరకుల ధరలు వెంటనే తగ్గించాలని సీపీఐ నాయకుడు జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. నరసింహనగర్ రైతుబజార్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరలు, కాయకూరల ధరలు భారీగా పెంచి ఆహార భద్రత లేకుండా చేశాయని మండిపడ్డారు. ధరల నియంత్రణకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని, లేదంటే ప్రజాగ్రహాన్ని చవిచూడక తప్పదన్నారు.

ఏఎంసీలో స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం



ప్రసంగిస్తున్న ఏఎంసీ వైస్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్. చిత్రంలో ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, ఇతర వైద్యులు

మహారాణిపేట: ఆల్ ఇండియా కోటా, స్టేట్ కోటాలో మొదటి రెండు రౌండ్ల కౌన్సెలింగ్‌లో చేరిన 2024 బ్యాచ్‌కు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థుల కోసం ఆంధ్రా మెడికల్ కాలేజీ సోమవారం ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించింది. పాఠ్యాంశాలు, ర్యాగింగ్ నిరోధక చర్యలు, హాస్టల్ సౌకర్యాలు మొదలైన వాటిపై కొత్తగా చేరిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజేంద్రప్రసాద్ అవగాహన కల్పించారు. వైద్య విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. డాక్టర్ రవీంద్రకిషోర్, డాక్టర్ భవాని, పద్మ గీతాంజలి పాల్గొన్నారు.

కలాసీలకు సర్వీస్ బెనిఫిట్స్ చెల్లించాలి

సీతంపేట : స్పెన్సర్స్ యాజమాన్యం కలాసీలకు సర్వీస్ బెనిఫిట్స్ చెల్లించాలని ముఠా కార్మిక సంఘం (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు రేసపువానిపాలెం స్పెన్సర్స్ హైపర్ మాల్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.మన్మధరావు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే రెహమాన్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా 22 మంది కలాసీలు ఇక్కడ లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చేస్తున్నారన్నారు. స్పెన్సర్స్ మాల్ మూసివేతతో వారంతా దిక్కుతోచని స్థితిలో పడ్డారన్నారు. రోడ్డున పడ్డ వీరికి సర్వీస్ బెనిఫిట్స్ ఇవ్వాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. యాజమాన్యం కలకత్తాలో ఉంటూ లేబర్ ఆఫీసులో జరిగే జాయింట్ మీటింగ్‌లకు హాజరుకాకుండా, కలాసీల సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేయడం సరి కాదన్నారు. సమస్య పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మేస్త్రి బి.నూకనాయుడు, బి.ఏసుబాబు, ఎస్.అచ్చంనాయుడు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ముఠా కార్మికులు

ఐఎంఎఫ్‌ఎల్ డిపోల్లో జట్ల పనులు కొనసాగించాలి

మహారాణిపేట: ఐఎంఎఫ్‌ఎల్ డిపో 1, డిపో 3ల్లో రెండు జట్ల పనులను యథావిధిగా కొనసాగించాలని హమాలీలు, కార్మికులు కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టర్‌కు పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. విశాఖ జిల్లా ముఠా కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ డిపోల్లో 30 ఏళ్లుగా లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చేసుకుంటూ 110 కుటుంబాలు జీవిస్తున్నాయని కార్యదర్శి ఎం.సుబ్బారావు తెలిపారు. డిపోల ప్రారంభం నుంచి అధికారుల పట్ల వినయ విధేయతలతో సేవలందిస్తున్నారని, ఎన్ని ఇబ్బందులు వచ్చినా పనులకు ఆటంకం కలగకుండా చూస్తున్నామన్నారు. కనీసవేతనాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని వినతి

సబ్బవరం: కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ సబ్బవరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంట్రాక్ట్ లెక్చరర్స్ సోమవారం పసుపు రిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు తమ సమస్యలను ప్రభుత్వానికి నివేదించి, సానుకూల స్పందన కోసం పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పీవీఎస్ మూర్తికి వినతి పత్రం అందించారు.ఎల్‌పీ రమణ బాబు, శ్రీనివాసరావు, వరప్రసాద్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

అగనంపూడి: అంబేడ్కర్ ఆశయాలు దేశ ప్రగతికి దిక్సూచి లాంటివని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 85వ వార్డు అగనంపూడి పునరావాస కాలనీ కొండయ్యవలస బీఆర్ అంబేడ్కర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఏడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలనే లక్ష్యంతో భారత రాజ్యాంగంలో అనేక అంశాలు జోడించారన్నారు. మహాత్మా జ్యోతిరావుపూలే అంబేడ్కర్‌సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు పరంధామయ్య, కార్పొరేటర్లు ఇల్లపు వరలక్ష్మి, బొండా జగన్, ఉక్కు కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, ఎస్.రామారావు, దుల్ల రామునాయుడు, విళ్లా రామ్మోహన్‌కుమార్, పాల్తేటి పెంటారావు, భూసా వెంకటరావు, బలిరెడ్డి సత్యనారాయణ, చైతన్య, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి వస్తున్న మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: వారంలో ఒకరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ఆమె తన క్యాంప్ కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీ కార్యాలయానికి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా వారంలో ఒక రోజు జీవీఎంసీ ఉద్యోగులతోపాటు అందరం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు. నగరంలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పరిశ్రమల యాజమాన్యాలు, నగర ప్రజలు వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థ వినియోగించడం వల్ల విశాఖలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.